క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



భూమిపూజ చేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని వడూర్‌లో నగరేశ్వర ఆలయ నిర్మాణానికి భూమి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. ఆలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాల శంకర్, బొలిశెట్టి రాములు, నాయిడి రవి, కుంట శంకర్, రామ్ సురేశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రజలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. గురువారం మండలంలోని గౌరాపూర్, తేజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సంఖ్య, చేపడుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఆర్థిక ఇబ్బందుల తొలగించేందుకు ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించి, ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ బూస మహేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఓటు ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఆయా కూడళ్ల వద్ద ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగోరావు, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ ఉన్నారు.

పండ్లు పంపిణీ

ఉట్నూర్‌రూరల్: కాలినడకన కొండగట్టుకు వెళ్లే హనుమాన్ దీక్షపరులకు లక్కారం గ్రామంలో గురువారం అజ్మీర జయచంద్ర పండ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఎండల నుంచి ఉపశమనం కలిగించేందుకు పండ్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కృషి



మరమ్మతులను పరిశీలిస్తున్న అధికారి

ఇచ్చోడ: మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యానగర్, సుభాష్‌నగర్ కాలనీలో పర్యటించి నీటికాలనీ వాసులతో మాట్లాడారు. మిషన్ భగీరథ నీటిని క్రమం తప్పకుండా సరఫరా చేసే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, మేజర్ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, తదితరులు ఉన్నారు.

విరివిగా నర్సరీల ఏర్పాటు

- నాసిరకంగా కూరగాయల నారు
- నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



నర్సరీలో పెంచుతున్న కూరగాయల నారు

తలమడుగు: సంప్రదాయ పంటల సాగు నుంచి ఇప్పుడిప్పుడే వాణిజ్య, ఉద్యాన పంటల సాగు వైపునకు రైతులు మొగ్గు చూపుతున్నారు. కానీ అనుమతులు లేని ఉద్యాన నర్సరీలు వారి పాలిట గుదిబండగా మారుతున్నాయి. నాసిరకం నారు అంటగట్టి రైతులను మరింత నష్టాల ఊబిలోకి నెట్టుతున్నారు. రైతులకు సరైన అవగాహన లేక నర్సరీ యజమానులు ఏది చెబితే అది విని పంటలు సాగుతున్నారు. దీంతో యజమానులకు పిరులు కురిపిస్తుండగా.. రైతులకు మాత్రం నష్టాలే మిగులుతున్నాయి. నియోజకవర్గంలో గుడిహత్నూర్, తలమడుగు, మండలాల్లో టమాటా, మిరప, వంకాయ, ఉల్లి, నారులను నర్సరీలు ఏర్పాటు చేసి పెంచుతున్నారు.

నిబంధనలు ఇవే..

కురగాయల నర్సరీలను ఏర్పాటు చేసుకోవాలంటే ప్రభుత్వం గుర్తింపు పొందిన కంపెనీలు విక్రయించే విత్తనాలను నర్సరీల యజమానులు కొనుగోలు చేసి. నారు పోయాలి. వాటికి సంబంధించిన కంపెనీ ప్లాట్ నెంబర్ బిల్లులు తీసుకోవాలి. రైతులకు నారు విక్రయించే ముందు రైతు పేరు, గ్రామం, కొనుగోలు చేసిన నారు రకం, ధరలతో పాటు రికార్డులు నమోదు చేసి విధిగా బిల్లు అందించాలి. నాసిరకం నారుతో పంట దిగుబడి రాకపోతే ఆ బిల్లు ఆధారంగా కంపెనీ యజమాన్యంతో నష్టపోయిన రైతుకు పరిహారం కోరే వీలు ఉంటుంది. అదే విధంగా నర్సరీ ప్రధాన ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేసి మొక్కల ధరలు తెలుగులో రాసి పెట్టాలి. బోథ్ నియోజకవర్గంలో నర్సరీ యజమానులు అసలు నిబంధనలు పాటించడం లేదు.

కన్నెత్తి చూడని అధికారులు..

నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా కురగాయల నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? ఏ విత్తనాలు వాడుతున్నారు అని పరిశీలించాలి. కానీ ఇటు వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు. ఫలితంగా ఇష్టారాజ్యంగా నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నర్సరీలను తనిఖీ చేసి నష్టపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

అనుమతి తీసుకోవాలి

టమాటా, మిర్చి, వంకాయ, ఉల్లి, ఇతర పంటల విత్తనాల నర్సరీలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా ఉద్యనవన శాఖ కార్యాలయంలో అనుమతులు తీసుకోవాలి. అనుమతులు తీసుకోని ఏర్పాటు చేసుకోవాలి.అనుమతి లేని వాటిని గుర్తించి నోటీలు చేస్తాం. నిబంధన విరుద్ధంగా నిర్వహిస్తున్న నర్సరీలపై చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్, ఉద్యానవన శాఖ అధికారి

మరమ్మతులు పూర్తి చేయాలి



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులను జూన్ 12లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజ్‌వీర్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలతో పాటు వడూర్, బొందిడి, సుర్దాపూర్ గ్రామాల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. నిధులు సైతం రూ.1 లక్షకు రూ.25వేలు అడ్వాన్స్ ఇవ్వడం జరుగుతుందని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వీరి వెంట ఎంఈవో భూమారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

గమ్యం యాప్ ఎంతో ఉపయోగకరం



అవగాహన కల్పిస్తున్న విలేజ్ ఆఫీసర్ పీఎస్ రెడ్డి

జైనథ్: బస్టాండ్‌కు వచ్చి గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా బస్సు వివరాలను అరచేతిలో చూసుకునేలా ఆర్టీసీ గమ్యం యాప్‌ను రూపొందించిందని విలేజ్ బస్సు ఆఫీసర్ పీఎస్ రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని బస్టాండ్‌లో గురువారం ఆర్టీసీ ప్రయాణికులకు గమ్యం యాప్ గురించి వివరించారు. ఆదిలాబాద్ నుంచి బయల్దేరిన బస్సు జైనథ్ బస్టాండ్‌కు ఎప్పుడు చేరుకుంటుందో యాప్ సాయంతో తెలుసుకోవచ్చన్నారు. లోకేషన్, డైరెక్షన్ చూసుకోవచ్చన్నారు. అనంతరం వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రత నియమాలు, ఆర్టీసీ సేవలు, పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రయాణికులు పాల్గొన్నారు.

లక్షే లక్ష్యం కార్యక్రమం ప్రారంభం



ప్రతిజ్ఞ చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు

ఎదులాపురం: ఆర్టీసీని లాభాల బాటలో తీసుకురావడానికి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ 2024 ఉగాది నుంచి 2025 ఉగాది వరకు ×లక్షే లక్ష్యం౯ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. డిపో పరిధిలో ఈ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈమేరకు డిపో మేనేజర్ కల్పన ఆర్టీసీ పతాకవిష్కరణ చేసి, అనంతరం డ్రైవర్లు, కండక్టర్లతో ప్రతిజ్ఞ చేయించారు. రోజుకు రూ. లక్ష ఆదాయం పెంచే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీకర్, సెక్యూరిటీ, మెకానికల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరితే సైన్యంలో చేరినట్లే



సమావేశంలో మాట్లాడుతున్న పాయల్ శంకర్

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జన్నారం: బీజేపీలో చేరితే సైన్యంలో చేరినట్లే అనుభూతి వస్తుందని, అధిక సంఖ్యలో యువకులు, కార్యకర్తలు బీజేపీలో చేరి మరోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రి చేద్దామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఆదిలాబాద్ బీ జేపీ అధ్యక్షుడు పాయల శంకర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు కాని హామీలతో తెలంగాణతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, హామీలు నెరవేర్చేందుకు అవసోపాలు ప డుతుందని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయా ణం తప్పా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏమీ చేయలేని పరిస్థితిలో పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అవినీతి ఊబిలో ఇరుక్కుపోయిందన్నారు. ఒ క్కొక్కటిగా అవినీతి బయట పడుతోందని ఆరోపించారు. ఇలాంటి అవినీతి పార్టీని దరిదాపుల్లోకి రానియ్యొద్దని కోరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గెడం నగేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, పార్లమెంటరీ కోకన్వీనర్ అశోక్, ఎంపీటీసీ శంకరయ్య, బీజేపీ మాజీ అధ్యక్షుడు చందు, బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, తిరుపతి, రమేశ్, సూర్యం పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఆత్రం భాస్కర్ సోదరుడు ఆత్రం రవీందర్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి వేర్వేరుగా గురువారం వారి నివాసానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కాకతీయ బార్ పక్కన గల వాటర్ సర్వీసింగ్ సమీపంలో గురువారం పేకాడుతున్న ఎనిమి ది మందిని టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.40వేల నగ దు, ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణారెడ్డి తెలిపారు.

ద్విచక్ర వాహనదారుడిపై దాడి

ఎదులాపురం: రాంగ్‌రూట్‌లో కారు నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా, అతడిపై దాడికి పాల్పడిన ఘటన గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణ సమీప రాంపూర్ గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో తన ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్ నుంచి రాంపూర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాంసి బస్టాండ్ రైల్వేగేట్ ప్రాంతంలో ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న కారు పృథ్వీరాజ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. పైగా కారులోని వ్యక్తి పృథ్వీరాజ్‌పై దాడికి పాల్పడి ద్విచక్రవాహనాన్ని తీసుకువెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం



ప్రమాద స్థలంలో బస్సు, లారీ

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జాతీయ రహదారి 44పై గురువారం సాయంత్రం బస్సును లారీ ఢీకొట్టింది. ఇచ్చోడ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు హైవే పక్కనే ఉన్న బస్టాండ్‌కు మలుపు తిరుగుతున్న తరుణంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం దెబ్బతింది. బస్సులోని ఇరువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, లారీ వేగం కొంత తక్కువగా ఉండడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

నార్నూర్: మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్‌ను మానవహక్కుల కమీషన్ మండల అధ్యక్షుడిగా నియమకమయ్యారు. గురువారం కమీషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంగల పెళ్లి హుస్సేన్ చేతుల మీదుగా నియమాక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య దేశంలో హక్కులు పొందే అధికారం ప్రతిఒక్కరికీ భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ప్రతిఒక్కరూ తమ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు.

అమరుల సంస్మరణ సభకు తరలి రావాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించే అమరుల సంస్మరణ సభకు ఆదివాసీ పెద్దలు తరలి రావాలని రగల్ జెండా కమిటీ అధ్యక్షుడు తోడసం నాగోరావ్ అన్నారు. గురువారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఏప్రిల్ 20న ఉదయం 10 గంటలకు నివాళులర్పించడం జరుతుందన్నారు. కార్యక్రమంలో మడావి ఇంద్రు, ముఖడే ఉత్తం, నాగ్‌నాథ్, కినక జుగాదిరావ్, సోమోరే నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు కాలనీలోని గడపగడపకూ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ప్రచార స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేశ్, ఖడే సంతోష్, జబీనా, ప్రమీల, అలీమ్, జగదీశ్ రెడ్డి, నసీం, సమీర్, వెంకన్న, అబ్దుల్లా, అజీస్ పాల్గొన్నారు.



వడూర్‌లో..

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు కోరారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతీ ఓటరును కలిసి ఓటు అభ్యర్థించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో నాయకులు పాల శంకర్, నాయిడి రవి, బొలిశెట్టి రాములు, కుంట శంకర్, మాకునూరి లక్ష్మణ్, గాదె సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న సూర్యకాంత్ గిత్తే

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తే అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ అధ్యక్షతన గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో మాట్లాడారు. కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. పోలింగ్ బూత్‌లను పటిష్ఠ పర్చాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు బంటు ప్రవీణ్, ధర్మపురి రాఘవులు, ఆకుల రాజశేఖర్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు చొక్కపల్లి రాములు, గట్టు నారాయణ, సాబ్లే కేవల్ సింగ్, ఇందూర్ గంగాధర్ పాల్గొన్నారు.

'ఆత్రం సక్కును గెలిపించుకుంటాం'



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న నాయకులు

నార్నూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంత్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోవ లక్ష్మి నాయకత్వంలో కార్యకర్తలు సైనికులుగా పని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో చాలా వ్యతిరేకత వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఊర్వేత రూప్ దేవ్, సయ్యద్ ఖాసిం, ఫిరోజ్ ఖాన్, సుభాష్ రాథోడ్, శివాజీ, దస్తగీర్, మెస్త్రం మాణిక్ రావు, శ్రీరాం పాల్గొన్నారు.

ఘనంగా సమరసత దివస్



బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: బాబాసాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా న్యాయవాద పరిషత్ ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో సమరసత దివస్‌ను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయాలను స్మరిస్తూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ బాటలో నడవాలన్నారు. బార్ కార్యదర్శిగా ఎన్నికైన సంతోష్ కుమార్, కోశాధికారిగా ఎన్నికైన రమణను న్యాయవాద పరిషత్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ చాలక్ ప్రతాప్ రెడ్డి, న్యాయవాద పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్, ఉమేష్ రావు, సుధీర్, దేవేందర్, విశ్వనాథ్, రామన్న, కుట్ల రమేశ్ పాల్గొన్నారు.

'పోషక లోపం ఉన్న చిన్నారులను గుర్తించాలి'



ఎన్ఆర్‌సీ కేంద్రంలో అడ్మిట్ చేస్తున్న శారద

నార్నూర్: పోషణ లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించాలని సీడీపీవో శారద అన్నారు. గురువారం మండలంలోని పూసిగూడ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు పోషణ లోపంతో బాధపడుతుండడంతో ఉట్నూర్‌లోని ఎన్ఆర్‌సీ కేంద్రంలో అడ్మిట్ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ పరిధిలో పోషణ లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి పోషకాహారం అందించాలన్నారు. చిన్నారులను ఎన్ఆర్‌సీ కేంద్రానికి తరలించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వందన, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మేజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. గురువారం బోథ్ మండలంలోని నారాయణపూర్, అందూర్, కందిపల్లి, రఘునాథ్‌పూర్, కోట(కె) గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కమలం పువ్వుగుర్తుకు ఓటు వేసి అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ స్టిక్కర్లు పంపిణీ చేశారు.

బీజేవైఎం మండలాధ్యక్షుడిగా జాదవ్ రాజేందర్

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన జాదవ్ రాజేందర్ బీజేవైఎం మండలాధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పని చేసినందుకు మండల బాధ్యతలు అప్పగించడం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ తెలిపారు. కాగా తనపై నమ్మకంతో మండల బాధ్యతలు అప్పగించినందుకు నాయకులకు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.